సాక్షి నిజామాబాద్

సోమవారం । 4 । ఆగస్టు । 2025



చోరీ కేసుల్లో పురోగతేదీ?
మోపాల్ మండలం కులాస్‌పూర్ గ్రామంలోని 11 ఇళ్లలో జరిగిన చోరీ కేసులో పురోగతి కనిపించడం లేదు.
- 8లో ▸



అమృతం తల్లిపాలు
తల్లిపాల ప్రాముఖ్యతను వివరించేందుకు ప్రభుత్వం ఏటా ఆగస్టు మొదటి వారంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తోంది.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.8 /23.3

వాతావరణం
ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'కేంద్ర ప్రభుత్వ నిధులతోనే రాష్ట్రాభివృద్ధి'



ఇందల్వాయి: కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేశ్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని గన్నారం గ్రామంలో గడప గడపకు బీజేపీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఇరవై నెలల్లో జీపీలకు నిధులు ఇవ్వకుండా అడ్డుపడుతోందన్నారు. ఆరు హామీలు అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు చిన్ను, మాజీ సర్పంచ్ మోహన్ రెడ్డి, కేపీ రెడ్డి, నాయిడి రాజన్న, జగత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి హాకీ టోర్నీ

నిజామాబాద్ నాగారం: తెలంగాణ ట్రాన్స్‌కో, డిస్కమ్స్ రాష్ట్రస్థాయి హాకీ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. నగరంలోని పోలీస్‌పరేడ్ మైదానంలో ఉదయం 10 గంటలకు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పోటీలను ప్రారంభిస్తారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎస్ఈ రాపల్లి రవీందర్ సభాధ్యక్షత వహిస్తారని, ప్రత్యేక ఆహ్వానితులుగా కామారెడ్డి ఎస్ఈ శ్రావణ్‌కుమార్, ఎస్‌సీవోఎంపీపీ రావు, రాష్ట్ర స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథ్ హాజరవుతున్నారని స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యులు ఏ గోపీ తెలిపారు.

6న అర్ధరాత్రి నుంచి డిచ్‌పల్లి రైల్వే గేటు మూసివేత

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): డిచ్‌పల్లి మండల కేంద్రం నుంచి ఘన్‌పూర్, ఖిల్లా డిచ్‌పల్లి, దూస్‌గాం, ముల్లంగి(బి) గ్రామాలకు వెళ్లే దారిలో ఉన్న రైల్వే గేటును మరమ్మతు పనుల కోసం నాలుగు రోజుల పాటు మూసివేయనున్నట్లు రైల్వే శాఖ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6న అర్ధరాత్రి 12 గంటల నుంచి 10వ తేది రాత్రి 11 గంటల వరకు గేటు మూసివేసి ఉంటుందని పేర్కొన్నారు. ఈ రైల్వే గేటు మీదుగా రాకపోకలు సాగించేవారు నాలుగు రోజులపాటు డిచ్‌పల్లి స్టేషన్, నాగ్‌పూర్ గేట్, 44వ నెంబరు జాతీయ రహదారిపై 7వ బెటాలియన్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఆలయం మీదుగా ఘన్‌పూర్ గ్రామానికి చేరుకోవాలని సూచించారు. ఘన్‌పూర్ నుంచి బొమ్మల గుండు హనుమాన్ మందిరం, 44వ నెంబరు జాతీయ రహదారి మీదుగా డిచ్‌పల్లి స్టేషన్‌కు చేరుకోవాలని సూచించారు.


వెతల వసతి..

సంక్షేమ వసతిగృహాల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. హాస్టళ్లలో చేపట్టాల్సిన మరమ్మతులపై సుమారు ఏడాదిన్నర కాలంలో అధికారులు రెండుసార్లు ప్రతిపాదనలు పంపినా ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదు. గదులకు, బాత్‌రూమ్‌లకు తలుపులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు నూతన హాస్టల్ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరైనా అనుమతులు రాకపోవడంతో పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఒక్క అయిలాపూర్‌లో మాత్రమే ఆర్మూర్ ఎమ్మెల్యే చొరవతో పనులను ప్రారంభించారు.

గిరిరాజ్ కళాశాల సమీపంలోని ఎస్సీ వసతి గృహంలో పెచ్చులూడిన పైభాగం



నామ్‌దేవ్‌వాడలోని ఎస్సీ వసతి గృహం బాత్‌రూమ్‌లో పైపు పగిలి నిండిన నీరు



- అధ్వానంగా సంక్షేమ వసతి గృహాలు
- మరమ్మతులు మరిచారా?
- రెండేళ్లుగా మంజూరుకాని నిధులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- నూతన భవనాలకు నిధులున్నా నిర్మాణానికి అనుమతిలేదు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో సంక్షేమ వసతిగృహాల పరిస్థితి అధ్వానంగా మారింది. మరమ్మతులకు సంబంధించి కేటాయించే ప్రత్యేక నిధులు రెండేళ్లుగా మంజూరుకాకపోవడంతో మరమ్మతులు కరువయ్యాయి. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఇబ్బందులు పడుతూ విద్యార్థులు కాలం గడుపుతున్నారు. మరమ్మతుల కోసం సంబంధిత అధికారులు రెండుసార్లు ఎస్టిమేషన్ వేసి నివేదికలు పంపినా నిధులు మాత్రం మంజూరు కావడం లేదు.

➡ జిల్లాలోని వసతిగృహాల్లో నెలకొన్న ప్రధాన సమస్య గదులకు, కిటికీలకు తలుపులు లేకపోవడం, బాత్‌రూమ్‌లు అధ్వానంగా మారడం.

➡ జిల్లా కేంద్రంలోని నాందేవాడలో ఉన్న బీసీ వసతి గృహంలో విద్యార్థుల రూములకు తలుపులు సక్రమంగా లేవు. టాయిలెట్స్ అధ్వానంగా ఉన్నాయి.

➡ నాందేవ్‌వాడలోని ఎస్టీ వసతి గృహంలో తలుపులు సక్రమంగా లేవు. బాత్‌రూమ్‌లకు డోర్‌లు లేకపోవడంతో అట్టలు, పరదాలు ఏర్పాటు చేసి విద్యార్థులు వాడుకుంటున్నారు. వంటగదికి తక్షణమే మరమ్మతులు చేయాల్సి ఉన్నప్పటికీ నిధులు లేక పాత రేకుల షెడ్డులో కొనసాగిస్తున్నారు.

➡ గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని వసతిగృహం శిథిలావస్థకు చేరింది. పై పెచ్చులు ఊడిపడుతున్నాయి. తక్షణమే మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

➡ దుబ్బ ప్రాంతంలోని బీసీ వసతి గృహం పరిస్థితి మరీ దారుణంగా ఉంది. నిధులు లేక మరమ్మతులు చేపట్టకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

➡ ఆర్మూర్‌లోని బాలికల వసతి గృహంలో మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. వర్షం కురిస్తే గదులు ఊరుస్తున్నాయి.

➡ బోధన్‌లోని ఎస్సీ వసతి గృహంలో గదులకు, కిటికీలకు తలుపులు లేకపోవడం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో వసతిగృహాలు	విద్యార్థులు
ఎస్సీ - 42	6324
బీసీ - 33	2,800
ఎస్టీ - 08	1,480

నూతన భవనాలకు మోక్షం లేదు

ఎస్సీ సంక్షేమ వసతిగృహాలకు నూతన భవనాల కోసం గతేడాది రూ.30 కోట్ల నిధులు మంజూరయ్యాయి. మొత్తం 42 హాస్టళ్లు ఉండగా.. తొమ్మిదిచోట్ల నూతన భవనాలు నిర్మించాలని ఆదేశాలు వచ్చాయి. నందిపేట మండలం అయిలాపూర్ వసతి గృహం అధ్వానస్థితిలో ఉందనే అంశాన్ని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి అసెంబ్లీలో లేవనెత్తగా భవనం నిర్మించాలని ఆదేశాలు వచ్చాయి. దీంతో ప్రస్తుతం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. కానీ మిగతా ఎనిమిది భవనాల నిర్మాణానికి మాత్రం అనుమతులు జారీ కాలేదు. అనుమతులు వస్తే నిర్మాణ పనులు మొదలయ్యే అవకాశం ఉంది.

2024లో నివేదికలు

2024 మార్చిలో సంబంధిత అధికారులు జిల్లాలోని సంక్షేమ వసతిగృహాలను పరిశీలించి మరమ్మతులకు సంబంధించిన నివేదికలను తయారు చేశారు. ఇందుకు రూ.8 కోట్లు అవసరమని ఉన్నతాధికారులకు విన్నవించారు. మళ్లీ ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో వసతిగృహాల మరమ్మతులకు సంబంధించి నివేదికలు పంపించాలని ఉన్నతాధికారులు ఆదేశించగా.. జిల్లా అధికారులు చేపట్టాల్సిన పనులకు సంబంధించి నివేదికలు రూపొందించి రూ.9 కోట్ల 70 లక్షలు అవసరం ఉంటాయని పేర్కొన్నారు. రెండుసార్లు నివేదికలు అందినా ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదు.

తక్షణం మరమ్మతులు చేపట్టాల్సినవి..	
ఎస్సీ	38
బీసీ	20
ఎస్టీ	08

నిధులు మంజూరు చేయాలి



సంక్షేమ వసతి గృహాల మరమ్మతులకు ప్రభుత్వం ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలి. అలాగే అవసరమైన చోట్ల నూతన భవనాలను నిర్మించాలి. ఈ విషయమై గతంలో అనేకసార్లు మేము విన్నవించాం. విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– రాజేశ్వర్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి

చాలా ఇబ్బందులు పడుతున్నాం



మా హాస్టల్‌లో తలుపులు, కిటికీలు సక్రమంగా లేవు. దోమల బెడద తీవ్రంగా ఉంది. బాత్‌రూమ్‌లు సక్రమంగా లేవు. చాలా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు వెంటనే స్పందించి అవసరమైన మరమ్మతులు చేయించాలి.

– గౌతమ్, ఎస్సీ హాస్టల్, నాందేవ్‌వాడ

నిధులు విడుదలైతే..



వసతి గృహాల మరమ్మతులకు నిధులు మంజూరైతే పనులు చేపడతాం. దీనికి సంబంధించి ఉన్నతాధికారులకు నివేదించాం. పైస్థాయి నుంచి అనుమతి, నిధులు మంజూరు కాగానే పనులను ప్రారంభిస్తాం.

– రజిత, ఎస్సీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి

దేవుళ్ల పేరుతో ఓట్లడిగితే నమ్మరు



ఉమ్మడి జిల్లా కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్.. వేదికపై మీనాక్షినటరాజన్, సీతక్క, షబ్బీర్, సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, లక్ష్మీకాంతారావు, సురేశ్‌షెట్కార్

- బీజేపీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదు
- మేము కూడా శ్రీరాముడిని పూజిస్తాం
- నాలుగు ముక్కల ఆటతో బీఆర్ఎస్ భూస్థాపితమైంది
- మరో 15 ఏళ్లు కాంగ్రెస్‌దే అధికారం..
- పార్టీలో పాత, కొత్త నాయకులకు సముచిత స్థానం
- పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్
- ముగిసిన జనహిత పాదయాత్ర

ఆర్మూర్ : దేవుళ్ల పేరుతో ఓట్లడిగితే ప్రజలు నమ్మరని, ఏ పరిస్థితుల్లోనూ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పలా మార్చిన బీఆర్ఎస్ నాలుగు ముక్కల ఆటతో పార్టీ భూస్థాపితమైందన్నారు. రాబోయే 15 ఏళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆర్మూర్ నియోజకవర్గంలో చేపట్టిన 'జనహిత పాదయాత్ర' రెండోరోజైన ఆదివారం కొనసాగింది. ముందుగా ఆలూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క శ్రమదానం చేశారు. అక్కడి నుంచి ఆర్మూర్ మండలం అంకాపూర్‌కు చేరుకున్నారు. మహేశ్‌కుమార్ గౌడ్ పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం గ్రామంలో పాదయాత్ర నిర్వహించి అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించారు. అనంతరం నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలోని జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ శివారులో ఉన్న యమునా గార్డెన్స్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముందుగా ప్రతి నియోజకవర్గం నుంచి ఇద్దరు కార్యకర్తలతో మాట్లాడించి స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. ఓట్ల సమయం వస్తేనే జైశ్రీరామ్ అంటూ మాట్లాడే బీజేపీ నేతలు పేదల గురించి ఆలోచించరని విమర్శించారు. శ్రీరాముడికి బీజేపీలో మెంబర్‌షిప్ ఇచ్చారా అని ప్రశ్నించారు. తాము కూడా శ్రీరాముడిని పూజిస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు కలిసి ఉండి సమష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తల వల్లే తాము ఈ రోజు పదవుల్లో ఉన్నామని, రాబోయే స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలకు పదవులు ఇచ్చే బాధ్యత తీసుకుంటామని భరోసా ఇచ్చారు. పార్టీ కోసం ఎన్నో త్యాగాలు చేసిన పాత కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందని అలాగే కొత్తవారికి ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. పదేళ్లు పార్టీ కోసం కష్ట నష్టాలకోర్చి లాఠీ దెబ్బలు తిని, జైళ్లపాలైన వారిని పార్టీ విస్మరించబోదన్నారు.

త్వరలో వ్యవసాయ కళాశాల..

తెలంగాణ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేసుకున్నామని త్వరలోనే వ్యవసాయ కళాశాలను తీసుకొస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల కూడా మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలోనే నిజామాబాద్ జిల్లాలో మెడికల్ కళాశాల, గుత్ప ఎత్తిపోతల పథకం, తెలంగాణ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంతోపాటు ఎన్నో సంక్షేమ పథకాలను చేపట్టామని గుర్తు చేశారు. షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణపై నిపుణులతో అధ్యయనం కొనసాగుతోందని తెలిపారు.

ఏఐసీసీ కార్యదర్శి సంపత్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఇన్‌చార్జి మంత్రి సీతక్క, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, లక్ష్మీకాంతారావు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, ఆకుల లలిత, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల ఇన్‌చార్జులు వినయ్‌రెడ్డి, సునీల్ రెడ్డి, ఈరవత్రి అనిల్, మార గంగారెడ్డి, మార చంద్రమోహన్, బాడ్సి శేఖర్‌రెడ్డి, గడ్కోల్ భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, ఖాందేశ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ స్ఫూర్తితోనే 'జనహిత'



కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 3,500 కిలో మీటర్లు పాదయాత్ర చేసి ప్రజల కష్టసుఖాలను తెలుసుకున్న రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రను స్ఫూర్తిగా తీసుకొనే జనహిత పాదయాత్ర నిర్వహిస్తున్నామని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పేర్కొన్నారు. దేశంలోని కాంగ్రెస్ కార్యకర్తలంతా ఒకే కుటుంబమన్నారు. రాహుల్ గాంధీ సూచన మేరకు తెలంగాణలో శాస్త్రీయ పద్ధతిలో కులగణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించేలా కృషి చేయడంతో అందరూ తెలంగాణ వైపు ఆసక్తిగా చూస్తున్నారన్నారు. బీజేపీ మాత్రం నాగ్‌పూర్ నుంచి ఆర్ఎస్ఎస్ ఇచ్చే ఆదేశాలను పాటిస్తూ దేశ ప్రజలను మతం పేరిట విడదీస్తోందని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో నిర్వహించే ఆందోళన కార్యక్రమాలకు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

క్లిక్ చేస్తే.. ఖాతా ఖల్లాస్

- ఆఫర్ల పేరిట గాలం
- సెల్‌ఫోన్లకు లింకులు పంపిస్తున్న సైబర్ కేటుగాళ్లు
- రెండేళ్లలో 759 కేసులు.. రూ.3.27కోట్ల రికవరీ
- బాధితుల్లో చదువుకున్న వారే అధికం

▪ జూలై 27న బాల్కొండ మండల కేంద్రానికి చెందిన యువకుడిని అమెజాన్ డెలివరీ హబ్ ఏర్పాటు పేరుతో సైబర్ నేరగాడు నమ్మించి రూ.1.71 లక్షలు కాజేశాడు. మోసపోయినట్లు గ్రహించిన యువకుడు పోలీసులను ఆశ్రయించాడు.

▪ జూలై 24న నగరంలోని కోటగల్లీకి చెందిన యువకుడి అకౌంట్ నుంచి ట్రేడింగ్ పేరిట రూ.5.40 లక్షలు విడతల వారీగా బ్యాంక్ ఖాతాల నుంచి విత్‌డ్రా అయ్యాయి. దీంతో సదరు యువకుడు నాల్గో టౌన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసు ఆరో టౌన్‌కు, అక్కడి నుంచి ఐదో టౌన్‌కు మారింది.



ఖలీల్‌వాడి: రోజురోజుకూ సైబర్ మోసాలు పెచ్చరిల్లుతున్నాయి. ఆఫర్ల పేరిట పుట్టుకొస్తున్న ఆన్‌లైన్ మోసాలకు చాలా మంది బలవుతున్నారు. క్లిక్ చేస్తే చాలు ఖాతాలు ఖాళీ అవుతున్నాయి. ఫైల్స్ ఓపెన్ చేసి సైబర్ క్రైమ్‌కు కొందరు గురైతే, ట్రేడింగ్ పేరిట వాట్సాప్‌కు వచ్చే మెసేజ్‌లను క్లిక్ చేసి దగా పడుతున్నారు.

ఆఫర్‌ల పేరిట మోసం

ఫోన్లకు వచ్చే ఆఫర్ల మెసేజ్‌లతో చాలా మంది అత్యాశకు పోయి నష్టపోతున్నారు. సైబర్ నేరగాళ్లు డిజిటల్ లావాదేవీలకు సంబంధించిన యాప్‌లను ఆసరాగా చేసుకొని లింకులు పంపుతూ మోసాలకు పాల్పడుతున్నారు. కాగా, సైబర్ మోసాల బారిన పడిన వారిలో అధికంగా చదువుకున్న వారే కావడం గమనార్హం. ప్రధానంగా ట్రేడింగ్ ఎక్స్‌పర్ట్‌లమని ఆన్‌లైన్‌లో పరిచయమవుతారు. కొంత ఇన్వెస్ట్ చేయించి అధిక లాభాలు చూపుతారు. మరింత ఇన్వెస్ట్ చేయించి మాయమవుతారు. ఇంకొందరు సీబీఐ, ఈడీ అధికారులమంటూ ఫోన్ చేసి మనీ ల్యాండరింగ్‌కు పాల్పడ్డారని భయపెడతారు. డిజిటల్ అరెస్టు పేరిట వీడియో కాల్స్ చేసి మీ ఖాతాలోని డబ్బులను ఖాళీ చేస్తారు. మరోవైపు కొరియర్, పార్సిల్ సర్వీస్, ప్రభుత్వ పథకాల పేరిట వచ్చే ఏపీకే ఫైల్స్‌ను ఓపెన్ చేసి చాలా మంది మోసపోవడం గమనార్హం.

ఖాతాల ఫ్రీజ్..

నిజామాబాద్ కమిషనరేట్‌లో పరిధిలో 1 జనవరి 2024 నుంచి 29 జూలై 2025 వరకు మొత్తం 759 సైబర్ క్రైమ్ కేసులు నమోదయ్యాయి. సైబర్ నేరగాళ్ల బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేసి వారి ఖాతాల నుంచి రూ. 3.27 కోట్లు రికవరీ చేశారు. కోర్టు ద్వారా బాధితులకు డబ్బులు అందజేశారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- సెల్‌ఫోన్లకు వచ్చే లింకులు నిర్ధారణ అయిన తర్వాతే ఓపెన్ చేయాలి.
- గుర్తు తెలియని ఫోన్ నెంబర్ల నుంచి గానీ, వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లు, కాల్స్ లిఫ్ట్ చేసి బ్యాంక్ వివరాలు, ఓటీపీలు, ఆధార్, పాస్‌కార్డుల వివరాలు చెప్పొద్దు.
- గంటలోపు ఫిర్యాదు చేస్తే సైబర్ క్రైం పోలీసులు ఆ లింక్ ద్వారా మోసగాళ్ల బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుంది.
- జిల్లా పోలీస్ స్టేషన్లలో రూ. 1000 నుంచి రూ. 7లక్షల వరకు, అంతకు మించి ఉంటే సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.

డిజిటల్ అరెస్ట్‌లు ఉండవు..

స్మార్ట్‌ఫోన్‌కు వచ్చే లింక్ మెసేజ్‌లను తెరువద్దు. జాగ్రత్తగా ఉంటే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడలేం. డిజిటల్ అరెస్ట్‌లు ఉండవు. బాధితులు అరగంట, గంటలోపు ట్రోల్ ఫ్రీ నెంబర్ 1930కి లేదా cyber.crime.gov.inకు ఫిర్యాదు చేస్తే రికవరీ చేసే అవకాశం ఉంటుంది.

– వెంకటేశ్వర్లు, ఏసీపీ, సైబర్ క్రైం, నిజామాబాద్

అడవులను ఆక్రమించనివ్వొద్దు

- ఇప్పటికే సాగు చేసుకుంటున్నవారికి ఇబ్బందులు కలిగించొద్దు
- పర్యావరణానికి హాని కలిగించే వారిపై చర్యలు తీసుకోండి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క



మోస్రాలో లబ్ధిదారులకు రేషన్ కార్డు మంజూరుపత్రాలను అందజేస్తున్న మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు పోచారం, జహీరాబాద్ ఎంపీ సురేశ్‌షెట్కార్, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తదితరులు

వర్ని: అడవులను ఆక్రమించనివ్వొద్దని, పర్యావరణానికి హాని కలిగించే చర్యలకు పాల్పడే వారిపై అటవీశాఖ అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. మోస్రా, చందూర్ మండలాల్లో ఆదివారం ఆమె పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు. చందూర్‌లో లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, మండల మహిళా సమాఖ్యకు రుణాలకు సంబంధించిన చెక్కును అందజేశారు. ఆయాచోట్ల ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఇదివరకే అటవీ భూములు సాగు చేసుకుంటున్న వారికి ఇబ్బంది కలిగించకుండా సంయమనం పాటించాలని సూచించారు. మహిళా సమాఖ్యల ద్వారా ఆర్టీసీలో అద్దె బస్సులను పెట్టించి ప్రతి నెలా రూ.70 వేల ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. ఐకేపీ ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మహిళలకు ఆదాయ వనరును సృష్టించామని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి డ్వాక్రా సంఘాల్లో రుణాలు ఇప్పిస్తున్నట్లు వెల్లడించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు బీజేపీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ బాలరాజు, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్లు సురేశ్‌బాబా, శ్యామల, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌గౌడ్, లావణ్య, మాజీ జెడ్పీటీసీలు అంబర్‌సింగ్, హరిదాసు, గంగారాం, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి పర్యటనలో బాహాబాహీ



చందూర్‌లో బాహాబాహీకి దిగిన ఇరువర్గాల నాయకులు, కార్యకర్తలు

ప్రభుత్వ సలహాదారు పోచారం, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గీయులు మంత్రి సీతక్క పర్యటనలో బాహాబాహీకి దిగారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న రెండు వర్గాల నాయకులు, కార్యకర్తలు పోటాపోటీగా నినాదాలు చేస్తూ తోసుకున్నారు. ఓ దశలో ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గీయులపై పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు ఇరు వర్గాలను సముదాయించి పరిస్థితిని చక్కదిద్దారు.

క్లుప్తంగా

తెయూలో నూతన గర్ల్స్ హాస్టల్ నిర్మించాలి



తెయూ(డిచ్‌పల్లి): రాజకీయాలను పక్కకు పెట్టి వెంటనే తెయూలో నూతన గర్ల్స్ హాస్టల్‌ను నిర్మించాలని ఏబీవీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మోహన్ డిమాండ్ చేశారు. తెయూ ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆదివారం గర్ల్స్ హాస్టల్ ఎదుట 'వీ వాంట్ జస్టిస్.. వీ వాంట్ గర్ల్స్ హాస్టల్' అని రాసి ఉన్న ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా మోహన్ మాట్లాడుతూ.. వర్సిటీలో సమస్యలు నెలకొన్నాయని, రూసా నిధులు మంజూరైనప్పటికీ వీసీ అలసత్వం, స్థానిక రాజకీయాల కారణంగా పనులు ప్రారంభించకపోవడం సిగ్గు చేటన్నారు. వర్సిటీ ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించకుంటే ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున అందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. నాయకులు పఠ్వీ, సమీర్, మనోజ్, అజయ్, అనిల్, అఖిల్, లెనిన్, సాయి, సరిత, రాహుల్ పాల్గొన్నారు.


శాంతాపూర్‌లో ఆర్‌ఎంపీ క్లినిక్ సీజ్



బిచ్కుంద(జుక్కల్): మండలంలోని శాంతాపూర్ గ్రామంలో ఓ ఆర్‌ఎంపీ వైద్యుడు క్లినిక్ ప్రారంభించి నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్నాడని ఫిర్యాదు రావడంతో రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు శనివారం సాయంత్రం క్లినిక్ సీజ్ చేశారు. అర్హతకు మించి వైద్యం చేస్తున్నాడని గ్రామస్తులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు పెద్దకొడప్‌గల్ పీహెచ్‌సీ డాక్టర్లు రోహిత్, ఉమాకాంత్, ఆర్‌ఐ రవిందర్ శాంతాపూర్ వెళ్లి విచారణ చేపట్టారు. సమాచారం తెలుసుకున్న సదరు ఆర్‌ఎంపీ వైద్యుడు అక్కడి నుంచి పారిపోయాడు. అధికారులు క్లినిక్‌కు తాళం వేసి సీజ్ చేశారు. పైఅధికారుల ఆదేశాల మేరకు పోలీసులకు ఫిర్యాదు చేస్తామని పూర్తి విచారణ చేసి జిల్లా అధికారులకు నివేదిక పంపిస్తామని అధికారులు తెలిపారు.

అమృతం తల్లిపాలు

- డబ్బాపాలతో అనారోగ్య సమస్యలు
- ఇంటింటికీ అంగన్‌వాడీ పేరుతో అవగాహన
- కొనసాగుతున్న తల్లిపాల వారోత్సవాలు



నిజామాబాద్ నాగారం: బిడ్డకు అమృతంతో సమానమైన తల్లి పాల ప్రాముఖ్యాన్ని మహిళలకు వివరించేందుకు ప్రభుత్వం ప్రతి ఏడాది ఆగస్టు మొదటి వారంలో తల్లి పాల వారోత్సవాలను నిర్వహిస్తోంది. సమగ్ర శిశు అభివృద్ధి సేవా సంస్థ (ఐసీడీఎస్) ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో వారం రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టతను వివరిస్తున్నారు. అపోహలను పోగొట్టేందుకు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు తల్లిపాల వారోత్సవాలకు శుక్రవారం శ్రీకారం చుట్టారు.

బిడ్డ పుట్టిన గంటలో 41 శాతం మంది పిల్లలకు మాత్రమే తల్లి పాలు ఇస్తున్నారు. బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండేందుకు అవసరమైన అన్ని రకాల పోషక విలువలు తల్లి పాలలో ఉంటాయి. బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత గంటలోపే బిడ్డకు తల్లి పాలు ఇవ్వాలి. దీంతో బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుంది. సాధారణంగా పిల్లలకు ఐదేళ్లలోపు వచ్చే డయేరియా, వైరల్ జ్వరాలు, కామెర్లు వంటి రకరకాల వ్యాధుల నుంచి తల్లిపాలు రక్షిస్తాయి. పిల్లలకు శ్వాసకోశ వ్యాధులు, ఆస్తమా, అలర్జీ, డయాబెటిస్ క్యాన్సర్, ఊబకాయం, చెవిలో ఇన్ఫెక్షన్లు రాకుండా ఉంటాయి.

వారోత్సవాల్లో..

- తల్లిపాల ప్రాధాన్యాన్ని వివరిస్తారు. పిల్లల ఎదుగుదలపై అవగాహన కల్పిస్తారు.
- 7 నుంచి 9 నెలల గర్భిణుల ఇంటికి వెళ్లి ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను చెబుతారు.
- గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందేలా చూడాలని కుటుంబసభ్యులకు వివరిస్తారు.
- పిల్లల మానసిక ఎదుగుదలకు తల్లి పాలు ఎంతో దోహదం చేస్తాయని, పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు బిడ్డకు తల్లి పాలను తప్పక ఇవ్వాలని వైద్యులు సూచిస్తారు.
- 7 నుంచి 24 నెలల పిల్లలకు తల్లిపాలతో అదనంగా ఆహారం ఇవ్వాలని సూచిస్తారు.
- ఇంట్లోనే సమతుల ఆహారం తయారీపై అవగాహన కల్పిస్తారు.
- బాలింతలు, గర్భిణుల ఇంటికి వెళ్లి కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు పూర్తి వివరాలు నమోదు చేస్తారు.
- ఆరు నెలల్లోపు వయసున్న చిన్నారుల ఇళ్లను సందర్శిస్తూ వారికి తల్లి పాలు అందుతున్నాయా? లేదా? అని ఆరా తీస్తారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టులు: నిజామాబాద్ అర్బన్, బోధన్, నిజామాబాద్ రూరల్, భీమ్‌గల్, ఆర్మూర్

అంగన్‌వాడీ కేంద్రాలు	:	1501
బాలింతలు	:	6099
గర్భిణులు	:	9771

శిశువుకు అమృతం

అమ్మపాలు శిశువుకు అమృతం వంటివి. శిశువు ఆరోగ్యంగా ఉండాలంటే ముర్రు పాలు పట్టించాలి. కృత్రిమ పాలు తాగిస్తే కలిగే నష్టాలపై గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించాలి. ప్రభుత్వ లక్ష్యాలు, అందిస్తున్న పథకాలను వివరించాల్సి ఉంది.

– రసూల్‌బీ, జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి

శ్రామికుల కష్టాలను గుర్తించడమే నాయకుల లక్షణం

- ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్



ఆలూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శ్రమదానం చేస్తున్న ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఇన్‌చార్జి మంత్రి సీతక్క

పెర్కిట్(ఆర్మూర్): శ్రామికుల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకొని వారి జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన రాజకీయ నాయకుని లక్షణమని ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పేర్కొన్నారు. జనహిత పాదయాత్రలో భాగంగా ఆలూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో బడుగు బలహీన వర్గాల కష్టాలను గుర్తించడానికే పాదయాత్ర, శ్రమదానం చేపట్టామన్నారు. ప్రజలకు సేవ చేయడంలో ఉన్న సంతృప్తి ఎందులోనూ లభించదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్, కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు పొద్దుటూరి వినయ్ రెడ్డి, ముత్యాల సునీల్ రెడ్డి, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, కాంగ్రెస్ పార్టీ ఆలూర్ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఖాందేశ్ శ్రీనివాస్, కోల వెంకటేశ్, సుర్బిర్యాల్ జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'జనహిత' పాదయాత్ర



గల్ఫ్ బాధిత కుటుంబాలతో సహపంక్తి భోజనం చేస్తున్న మీనాక్షి నటరాజన్, మహేశ్ కుమార్ గౌడ్, సీతక్క, షబ్బీర్ అలీ, సుదర్శన్ రెడ్డి, భూపతిరెడ్డి, సురేశ్ షెట్కార్ తదితరులు

ఆర్మూర్: ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ చేపట్టిన జనహిత పాదయాత్ర ఆర్మూర్ నియోజకవర్గంలో ఆదివారం ముగిసింది. ఆలూర్‌లో శ్రమదానం అనంతరం అంకాపూర్‌లో పాదయాత్ర చేపట్టారు. అనంతరం జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ శివారులోని యమునా గార్డెన్స్‌లో ఉమ్మడి జిల్లాస్థాయి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందుకున్న గల్ఫ్ మృతుల కుటుంబాలు ఫ్లెక్సీ ఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీకి కృతజ్ఞతలు తెలిపాయి. అనంతరం వారితో సహపంక్తి భోజనాలు చేశారు.

బీజేపీ పాలిత ప్రాంతాల్లోనూ ముస్లింలకు రిజర్వేషన్లు



బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లింలకు రిజర్వేషన్లు కొనసాగిస్తూ తెలంగాణలో మాత్రం రిజర్వేషన్లు ఇవ్వొద్దని చెప్పడం ఆ పార్టీ నేతలకు సరైంది కాదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు డబ్బులు సంపాదించుకునే పార్టీలే కాని, పేదలకు చేసింది శూన్యమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రతి రాజకీయ నాయకుడు ప్రజల్లో ఉండాలన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి



ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో వెనకబడినప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించాలని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ సూచించారు. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

పదేళ్లలో విద్యారంగం అధ్వానం



పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రంలో విద్యారంగం అధ్వానంగా మారిందని, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేశారని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ తన కుటుంబం కోసం వేల కోట్ల రూపాయలు సంపాదించి రేపటి రోజు జైలుకు వెళ్లే పరిస్థితికి వచ్చాడన్నారు. ఈ విషయాలన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రచారం చేసి కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు.

కార్యకర్తలను గెలిపించుకుంటాం



స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించుకోవడం పార్టీ బాధ్యత అని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. బీసీ బిల్లుపై అసెంబ్లీలో మద్దతు తెలిపిన బీజేపీ ఎమ్మెల్యేలు.. ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్ వస్తుందంటూ అభ్యంతరం తెలపడం సరికాదన్నారు.

కాంగ్రెస్‌దే విజయం



స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు భవిష్యత్‌లో వచ్చే ఏ ఎన్నికల్లో అయినా కాంగ్రెస్ పార్టీదే విజయమని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ఎర్రజొన్న, పసుపు రైతులు చేపట్టిన ఉద్యమాల్లో కాంగ్రెస్ నాయకులపైనే ఎక్కువ కేసులు ఉన్నాయని, కేసులను ఎత్తివేయాలని కోరారు.

కార్యకర్తల పాత్ర కీలకం..



జుక్కల్ నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 50కి పైగా పంచాయతీలను ఏకగ్రీవం చేసేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తల పాత్ర కీలకమైందని తెలిపారు.

సామాజిక న్యాయంతోనే..



బీసీ రిజర్వేషన్లు అమలైతే రాహుల్ గాంధీ నాయకత్వం బలోపేతం అవుతుందనే భయంతో ఎన్‌డీఏ ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు.

జీవితంలో విలువైన బంధం 'స్నేహం'


- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్
- నగరంలో ఘనంగా సంగీత, సాహిత్య కవుల ఆత్మీయ సమ్మేళనం



ఎమ్మెల్యే ధన్‌పాల్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కలం స్నేహం అసోసియేషన్ ప్రతినిధులు, కవులు

సుభాష్‌నగర్: స్నేహమనేది మానవ జీవితంలో అత్యంత విలువైన బంధమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని ఎల్లమ్మగుట్ట మున్నూరుకాపు సంఘంలో ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా కలం స్నేహం అసోసియేషన్ ఆధ్వర్యంలో సంగీత, సాహిత్య కవుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ధన్‌పాల్ మాట్లాడుతూ.. కలం ద్వారా స్నేహం పెంచుకుంటూ, భావాల పరస్పర మార్పిడికి వేదికలను కల్పిస్తున్న కలం స్నేహం అసోసియేషన్ వంటి సంస్థల సేవలు ప్రశంసనీయమన్నారు. సమాజాన్ని చైతన్యపర్చడంలో కవులు, కళాకారులు కీలకపాత్ర పోషిస్తారని, కళలు మానవ వికాసానికి తోడ్పడుతాయని తెలిపారు. మహిళా సాధికారతలో భాగంగా ఎందరో కవులను తీర్చిదిద్దుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్ ఆచార్య, ఉపాధ్యక్షుడు హరిప్రియను ప్రత్యేకంగా అభినందించారు. సమ్మేళనంలో కవిత్వాలు, సంగీత ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో సాహితీ, సంగీత కవులు, మహిళలు పాల్గొన్నారు.

జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యవర్గం ఎన్నిక



ఆర్మూర్‌టౌన్: హ్యాండ్‌బాల్ సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్మూర్ పట్టణంలోని నటరాజ ఫంక్షన్ హాల్‌లో జిల్లా హ్యాండ్‌బాల్ సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం చైర్మన్‌గా అల్జాపూర్ దేవేందర్, ప్యాట్రన్‌గా టీ విద్యాసాగర్‌రెడ్డి, అధ్యక్షుడిగా కోల గంగామోహన్ చక్రు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, ఓ.సునీత, సొడ సురేశ్, బీ శ్యామ్, బాపూరావు, ప్రధాన కార్యదర్శిగా పింజ సురేందర్, సంయుక్త కార్యదర్శులుగా అనుపల రజిత, రమణమూర్తి, మాధురి, సతీశ్ రెడ్డి, లింగం, కోశాధికారి గట్టడి రాజేశ్, నిర్వహణ కార్యదర్శిగా రాహుల్, ఎం.సాయికుమార్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి, హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన శ్యామల పవన్‌కుమార్ సంఘం సభ్యులు సన్మానించారు.

క్రైం కార్నర్

దేమికలాన్‌లో ఒకరి ఆత్మహత్య

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని దేమికలాన్ గ్రామంలో ఒకరు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మురళి తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన కొనింటి గంగయ్య(71)కు భార్య సంగవ్వ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. సంగవ్వ కొన్నేళ్లుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. ఎన్ని ఆస్పత్రుల్లో చూపించినప్పటికీ వ్యాధి నయం కాలేదు. తనకున్న అర ఎకరం భూమిని అమ్మి, వచ్చిన డబ్బుతో భార్యకు వైద్యచికిత్స అందించాడు. అలాగే తన ఇద్దరు కూతుళ్లకు పెళ్లిళ్లు చేయించడం అప్పులపాలయ్యారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన గంగయ్య శనివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

ధర్మోరాలో ఒకరి ఆత్మహత్యాయత్నం

మాక్లూర్: మండలంలోని ధర్మోరా గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన అరుణ్ ఆదివారం కుటుంబంలో గొడవల కారణంగా ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. స్థానికులు, కుటుంబసభ్యులు గమనించి వెంటనే నీళ్లు పోసి, మంటలను ఆర్పివేశారు. కానీ అప్పటికే అరుణ్ శరీరం చాలావరకు కాలిపోయింది. చికిత్స నిమిత్తం అతడిని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అరుణ్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారని గ్రామస్తులు తెలిపారు.

మహిళ అదృశ్యం

మోపాల్: మండలంలోని చిన్నాపూర్ గ్రామానికి చెందిన కోతోళ్ల భారతి అదృశ్యమైనట్లు ఎస్‌ఐ జాడె సుస్మిత ఆదివారం తెలిపారు. భారతికి, ఆమె భర్త నర్సయ్యకు మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం కూడా గొడవ జరగడంతో తాను చనిపోతానని ఆమె ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో భారతి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసుల్లో పురోగతేదీ?

- కులాస్‌పూర్‌లో ఒకేరోజు 11 ఇళ్లల్లో దొంగతనాలు
- పదిరోజులైనా లభ్యం కాని నిందితుడి ఆచూకీ
- రెండు బృందాలు గాలిస్తున్నా ఫలితం శూన్యం



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీపీ సాయి చైతన్య(ఫైల్)

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కులాస్‌పూర్ గ్రామంలో ఇటీవల జరిగిన చోరీ ఘటనపై పురోగతి కన్పించడం లేదు. దుండగులు ఒకే రోజు ఏకంగా 11 ఇళ్లల్లో దొంగతనానికి పాల్పడి భారీగా సొత్తు దోచుకెళ్లినా.. పోలీసులు కేసును ఇప్పటివరకు ఛేదించలేకపోయారు. పోలీసులు మాత్రం రెండు బృందాల ద్వారా గాలిస్తున్నామని చెబుతున్నా.. నిందితులను పట్టుకోవడంలో సఫలీకృతం కావడంలేదు.

గత నెలలో జరిగిన ఘటనలు..

మోపాల్ ఎస్‌ఐగా జాడే సుస్మిత బాధ్యతలు స్వీకరించిన రోజే (జూలై 6న) నర్సింగ్‌పల్లిలో ఓ చోరీ ఘటన జరిగింది. దుండగులు 11 తులాల బంగారం, రూ.35వేల నగదును దోచుకెళ్లారు. అదే నెలలో 23న అర్ధరాత్రి కులాస్‌పూర్‌లో తాళం వేసి ఉన్న 11ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. పక్కనున్న ఇళ్లకు బయటి నుంచి గొళ్లాలు బిగించి తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడ్డారు. మొత్తం 7.3 తులాల బంగారం, 54 తులాల వెండి, రూ.3.85లక్షల నగదు చోరీకి గురైంది. అంతేగాకుండా ముదక్‌పల్లి చిలుకల చిన్నమ్మ ఆలయం, మంచిప్పలోని గండి మైసమ్మ ఆలయాల్లో కూడా దొంగతనాలు జరిగాయి.

సీరియస్‌గా తీసుకున్న పోలీసులు..

చోరీ కేసులను జిల్లా పోలీస్ అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. సీపీ సాయి చైతన్య స్వయంగా కులాస్‌పూర్ గ్రామాన్ని సందర్శించి ఘటనపై ఆరా తీశారు. నిందితులను పట్టుకునేందుకు రెండు ప్రత్యేక బృందాలను నియమించారు. సీసీ ఫుటేజీలను పరిశీలించినా ఎలాంటి ఆధారాలు లభించలేదని పోలీస్‌వర్గాల భోగట్టా. కానీ నిందితుడు బోధన్‌కు చెందిన పాత నేరస్తుడిగా అనుమానిస్తున్నారు. మండలంలో వరుస దొంగతనాలు జరుగుతున్నా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. చోరీల నివారణకు గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించాలని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రాత్రివేళల్లో పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే పట్టుకుంటాం..

కులాస్‌పూర్ చోరీ కేసులో నిందితుడి కోసం గాలింపు ముమ్మరం చేశాం. దీని కోసం ప్రత్యేకంగా రెండు బృందాలు గాలిస్తున్నాయి. కొన్ని ఆధారాలు లభించాయి. త్వరలోనే నిందితుడిని పట్టుకుంటాం. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఇళ్లకు తాళం వేసి వెళ్లే పక్కంటి వారికి సమాచారమివ్వాలి.

– సురేష్‌కుమార్, నిజామాబాద్ నార్త్ సీఐ

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- ఇద్దరికి గాయాలు



హర్సు నాయక్(ఫైల్)



ప్రమాదానికి కారణమైన బైకు

ఇందల్వాయి: మండలంలోని గన్నారం గ్రామ ముఖ ద్వారం వద్ద గల జాతీయ రహదారి 44పై జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై సందీప్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని ఎత్తుతండాకు చెందిన హర్సునాయక్(56), లాల్‌సింగ్ అనే ఇద్దరు వ్యక్తులు ఆదివారం టీవీఎస్ ఎక్సెల్‌పై గన్నారం గ్రామానికి బయలుదేరారు. గన్నారం గ్రామ ముఖ ద్వారం వద్ద గల హైవేపై వారు యూటర్న్ తీసుకుంటుండగా కామారెడ్డి నుంచి బైక్‌పై వస్తున్న సమీర్ వారిని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ముగ్గురు రోడ్డుపై పడిపోగా, హర్సునాయక్ మృతిచెందాడు. మిగిలిన ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఒకరు..

నందిపేట్ (ఆర్మూర్): మండలంలోని సిద్దాపూర్ గ్రామంలో ఓ వ్యక్తి విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. వివరాలు ఇలా.. సిద్దాపూర్ గ్రామానికి చెందిన దంతాల రాజేందర్ (27) ఆదివారం వన్నెల్(కే) గ్రామ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు రిపేర్ చేయడానికి వచ్చాడు. రిపేర్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంటు షాక్ తగలడంతో అతడు కింద పడిపోయి మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు.

మాచాపూర్‌లో చోరీ



ఎల్లారెడ్డి: మండలంలోని మాచాపూర్ గ్రామంలో చోరీ జరిగినట్లు ఎస్సై మహేష్ ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన బైరం జేకోబ్ అనే వ్యక్తి తన ఇంటికి తాళం వేసి, కుటుంబ సభ్యులతో కలిసి ఊరికి వెళ్లాడు. ఈక్రమంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి తులంన్నర బంగారం చోరీ చేశారు. మరుసటి రోజు బాధిత కుటుంబసభ్యులు చోరీని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏఐతో వ్యాపారం మరింత సులభం

తెయూ(డిచ్‌పల్లి): వ్యాపారంలో వచ్చే అనేక సవాళ్లకు డిజిటల్ విప్లవం అవకాశాలను, పరిష్కారాలను చూపించిందని, రానున్న కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ద్వారా వ్యాపారం మరింత సులభతరం అవుతుందని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి అన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, రేడియంట్ గ్రూఫ్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ (మధ్యప్రదేశ్, జబల్పూర్) సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ కామర్స్ సదస్సులో ఆయన గూగుల్ మీట్ ద్వారా ప్రసంగించారు. 'డిజిటల్ ఏజ్ : ట్రెండ్స్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ అండ్ ఫ్యూచర్ బిజినెస్' అనే అంశంపై యాదగిరి మాట్లాడుతూ.. పూర్వకాలంలో వ్యాపార లావాదేవీలన్నీ రాతప్రతుల ద్వారా జరిగేవన్నారు. 1970లో ప్రారంభమైన డిజిటల్ విప్లవం క్రమంగా వేగం పుంజుకొని మరింతగా విస్తరించిందన్నారు. కృత్రిమమేధ ద్వారా విప్లవాత్మకమైన మార్పు వల్ల క్లిష్టమైన, ఖరీదైన వ్యాపార వ్యూహాలు సులభతరమైనట్లు పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా మోసాలకు కళ్లెం వేయవచ్చని, దుబారాను తగ్గించుకుని సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవచ్చన్నారు. సదస్సులో జబల్పూర్‌లోని రాణి దుర్గావతి యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ రాజేష్ కుమార్ వర్మ, వివిధ వర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు సునీల్ కుమార్ పావా, సంగీత్ జాంబ్, సంజయ్ తివారి, రాజ్ కుమార్ గౌతమ్, ప్రమోద్ విశ్వకరం, ఆభా శుక్లా, రాజశేఖర్, అనుపమ పాల్గొన్నారు.

ఫ్రెండ్‌షిప్ డే.. ఒక్కచోటికి చేరిన బాల్య మిత్రులు



దోమకొండ జెడ్పీహెచ్‌ఎస్ (బాలుర) 1992-93 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు



కామారెడ్డిలోని ప్రగతి విద్యాలయం 1995-96 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

- జిల్లాలో పలుచోట్ల ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించిన పూర్వవిద్యార్థులు
- ఆత్మీయ పలకరింపులతో భావోద్వేగానికి గురైన చిన్ననాటి మిత్రులు



మంచిప్ప జెడ్పీహెచ్‌ఎస్ 2005-06 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

సాక్షి, నెట్‌వర్క్: ఉమ్మడి జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా 'పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం' నిర్వహించారు.

ఈసందర్భంగా చిన్ననాటి మిత్రులందరూ ఏళ్ల తర్వాత మళ్లీ ఒకే వేదికపై కలుసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. అరే ఎన్నాళ్లయింది కలుసుకుని.. పూర్తిగా మారిపోయావంటూ ఆనాటి స్నేహితులు ఆత్మీయ పలకరింపులు.. ఆపాత మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకుని భావోద్వేగానికి గురయ్యారు. నాడు చదువు నేర్పిన ఉపాధ్యాయులను సమ్మేళనానికి ఆహ్వానించి, సన్మానించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం విద్యార్థులు, గురువులు అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.